


# ఎంత పని జరిగింది!

పొలదుగు వెంకటేశ్వరరావు

నరసింహం గారమ్మాయి, అమెరికానుండి వచ్చి, ఫోను గొట్టిన క్షణం నుండి, తగులుకుంది తాయారు, భర్త భూషణాన్ని, చెవిలో జోరీగలాగా పోరగా పోరగా అప్పటిగ్గాని బయులుదేరలేదు భూషణం. నరసింహంగారమ్మాయీ, భూషణంగారమ్మాయీ అమెరికాలో సాన్‌హెూసే అన్న పేరు గలవూర్లో వుంటున్నారు మంచి ఫ్రెండ్సు. వాళ్ల భర్తలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. పిల్లల్ని చూసిరావటానికని అమెరికా వెళ్లినప్పుడు అయిన పరిచయాలు, క్రమంగా బలపడి స్నేహలతలుగా చిగురించి ఆ బంధనాలు ఆత్మీయతలుగా పెనవేసుకొని సుమారు అయిదారేళ్లయ్యింది.

తాయారు దృష్టిలో, నరసింహంగారు ప్రయోజకుడు! బుద్ధి శాలి! తెలివిమంతుడు.

నరసింహం సుమారు ఆరడుగుల పొడగిరి. ఆజానుబాహువు. ఖద్దరు చొక్కా, పంచా ధరించి పై పంచ భుజాన్న వ్రేలాడగా, చేతులూపుకుంటూ అంగలూపంగలూ వేసి నడుస్తూ వుంటే, కొత్త వేషం గట్టిన దుర్యోధన సార్వభౌముడు గుర్తొచ్చాడని, తెలిసోతెలియకో, ఒకాయన అనగా, మీది మీదకి వెళ్లి, అతన్ని కొట్టినంత పని చేసాడు ఒకనాడు అంటారు పరిచయస్తులు. మొదటి నుంచీ నరసింహానిది బాగా దూకుడు స్వభావం. పెద్దగా చదువుల్లేకపోయినా

ఆ రోజుకి నాలుగో నాడు ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. భూషణానికి నిద్ర మగతగా వుంది. పూర్తి మెలకువ రాలేదు. పాదాలని ఏదో తాకినట్లు అన్పించి హఠాత్తుగా కళ్లు తెరిచాడు భూషణం. చేతుల్తో భర్త పాదాల్ని స్పృశించి, మంగళసూత్రాలకి వాట్ని తాకించి, కళ్లకి అద్దుకుంటూ వుంది తాయారు. ఆమె కళ్లు శ్రావణ మేఘాల్లాగున వున్నాయ్!



వ్యవహార దక్షతకి కొదవలేదు. కనుకనే అతను ఎందులో చెయ్యి పెడితే అందులో బాగా కలిసి వచ్చింది. ఊర్లో పొలాలు కొన్నాడు, పట్నంలో రెండు మేడలు కట్టాడు. హైదరాబాద్‌లో స్థలాలు సంపాదించాడు. రెండుసార్లు ఎం.ఎల్.ఏగా పోటీ చేసి ఓడిపోయినా ఎంతో పలుకుబడి పెంచుకున్నాడు. ఒక్క క్షణం ఖాళీగా వుండడు. ఎప్పుడూ తిరుగుతూ వుంటాడు. ఎన్నో వ్యవహారాలు, ఎంత మందితోనో పరిచయాలు. ఇద్దరాడపిల్లలూ సుఖంగా సంసారాలు చేసుకుంటున్నారు. పెద్ద అమ్మాయిది అమెరికా. రెండవ అల్లుడుకి మద్రాసులో పెద్ద ఉద్యోగం. పిల్లా పాపలతో కళ కళ్లాడే సంసారాలు వాళ్లవి.

వాళ్లతో పరిచయమయిన తరువాత, రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూసిన చందాన, తాయారు దృష్టిలో ఎంతో చిన్న వాడిలాగా అగుపడ్డాడు భూషణం.

'ఎంత సేపూ ఆ పుస్తకాలు!! అందులో అంతగా ఏముంటుందీ!!' విసుక్కుంటుంది తాయారు.

'ఈ పుస్తకాల్లో మనకి తెలియని సంగతులు ఎన్నో వుంటాయి. పుస్తకాలు చదివితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చును.' అంటాడు భూషణం, నిదానంగా.

'ఆ తెలుసుకుని ఏమిటి ప్రయోజనం?' అని సూటిగా పొడిచాననుకుంటుంది.

అది తెలుసుకున్న వ్యక్తి మీద గదా ఆధారపడి వుంటుంది' అని నవ్వుతాడు భూషణం. ఆ నవ్వు తాయారుకి చిరాకు తెప్పిస్తుంది. అక్కడితో సంభాషణ ఆపి చిటపటలాడుతుంది, నిప్పులో పడిన వుప్పు వలుకులాగా.

భూషణం ఇన్నాళ్లూ ఏదో వుద్యోగం చేసి పోయినేడాదే రిటైరయ్యాడు. శివార్లో ఒక చిన్న అపార్టుమెంటు కొనుక్కుని సెటిలయ్యాడు. కూతురికి అమెరికా సంబంధం కుదిరి పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. హాపీగా వుంది. కొడుకు బాగా చదువుకుని ప్రయోజకుడై ఢిల్లీలో వుంటున్నాడు. అప్పుడప్పుడు వచ్చి అమ్మాబాబుల్ని చూసి పోతూ వుంటాడు. అతనికి పిత్రార్జితం అవసరం లేదు. తాతల్నాటి ఆస్తి కొద్దో గొప్పో వుంది. పెన్షనూ వస్తుంది. సంసారానికి లోటు లేదు.

ఆ మాట భూషణం అంటే చచ్చినా ఒప్పుకోదు తాయారు.

'ఆ నరసింహం గార్ని చూడండి! ఎంత సంపాదించాడు! ఇంకా సంపాదిస్తూనే వున్నాడు! క్షణం తీరిక లేకుండా ఇంకా కష్టపడి..'

'ఎందుకూ కష్టపడటం?'

'పురుషుడన్నాక ఏదో ఒక పూనిక వుండాలిగదా'

'మనశ్శాంతి లేకపోయినాక ఏదయినా ఎందుకూ?'

'ఆ పనికి మాలిన పుస్తకాలు ముందేసుకుని కూర్చోవటం, ముదనష్టపాళ్లతో స్నేహాలు చెయ్యటం, కాలాన్ని వృధాగా వెళ్లమార్చి జీవించడం ఇవి తెస్తాయా మనశ్శాంతి?!'

ఆ మాటకి భూషణం నవ్వుతాడు. ఆ నవ్వు ఒంటికి కారం రాసుకున్నట్లనిపించి చిర చిరలాడ్తుంది తాయారు.

వాస్తవంగా ఆలోచిస్తే తనకి ఏం తక్కువ అని, అప్పుడప్పుడు, తాయారుకే అన్పించక పోలేదు. చీకూ చింతాలేని సంసారం. బంగారం లాంటి పిల్లలు. సాత్వికుడయిన భర్త. ఏనాడయినా ఇంట్లో తన మాటే సుగ్రీవాజ్ఞ! బుర్రల్ని తాటి గుంజలా, నజ్జు నజ్జుచేసిన సమస్యలు ఎప్పుడూ లేవు!

అయినా....

ఇప్పుడిప్పుడు ఆ నరసింహంగారి ప్రయోజకత్వాన్ని కళ్లారా చూస్తూ వున్న తర్వాత తాయారు మనస్సులో వెలితి కన్పించుతున్నది. పోలికలు పుట్టుకుని వస్తున్నాయి. సెలవేసి మనస్సుని తొలుస్తున్నాయి. వాళ్లకి కారు వుంది, మేడలున్నాయి, బాగా డబ్బుంది! ఇవన్నీ తమకి ఎక్కడివి?!

నరసింహంగారు ఎంత పొడుగో అతని భార్య భవాని అంత పొట్టిది. ఆమెకు ఇల్లే లోకం. కడిగినదాన్నే పదిసార్లు కడిగీ, తుడిచిందాన్నే పలుసార్లు తుడిచీ కాలక్షేపం చేస్తూ వుంటుంది. మేడనిండా పనివాళ్లకి కొదవ లేదు. అయినా ఆమె ధోరణి ఆమెదీ. నెలలో సాతికదినాలు నరసింహంగారు వ్యవహారాల పని మీద వూళ్లు పట్టుకుని తిరుగుతాడు. ఆ సంగతి ఆమె పట్టించుకోదు. నరసింహంగారు మంచి మాటకారి. ఆమె వినటమేగాని మాట్లాడటం చాలా తక్కువ. భార్యాభర్తలు ఇద్దరూ చాలా మంచివాళ్లు. గర్వం లేదు. స్నేహానికి విలువిస్తారు.

భూషణం డ్రస్సప్పయి భార్యకోసం హాలులో కూర్చుని ఎదురుచూసాడు. అరగంట తర్వాతగాని తాయారు



## దెబ్బ తిన్నాక స్నేహితుల సాయం

అక్షయ్‌కుమార్‌తో తన భవిష్యత్తును బంగారంగా ఊహించేసుకున్న శిల్పాశెట్టి పాపం, చివరికి దెబ్బ తింది. దాదాపు రెండేళ్లు వేచింది తనను పెళ్లాడతాడనే ఆశతో. రకరకాలుగా ప్రయత్నించి ఆఖరికి తన ప్రేమజీవితం ఇలాగైపోయేసరికి, కనీసం కెరీర్‌నైనా దిద్దుకుందామనుకుంది శిల్ప. తన పాతమిత్రులైన సంజయ్‌దత్, నానాపాటేకర్‌లను కలిసి సాయం కోరింది. వారి సిఫారసుతో కొన్ని చిత్రాలు లభించాయి శిల్పకు. మనసును పూర్తిగా లగ్నం చేసి చక్కగా నటిస్తూందన్న పేరు తెచ్చుకుంటూందిప్పుడిప్పుడే. భవిష్యత్తులో ఇంకా ఎంత పేరు సంపాదించుకుంటుందో చూడాలని ఆమె అభిమానులంతా ఎదురుచూస్తున్నారు.

ఎస్.

## దర్శకుడవుతున్న మెగాస్టార్ 'తమ్ముడు!'

ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారా? ఈ వార్త నిజమండీ! మన మెగాస్టార్ చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్ తెలుగుసినీపరిశ్రమలో హ్యాట్రిక్ సాధించిన నటుడు. ఎలాగంటే 'తొలి ప్రేమ, తమ్ముడు, బద్రి' చిత్రాలు మూడూ వరసగా హిట్లయ్యాయి. బాగా పేరుతెచ్చుకుని విశేషంగా గుర్తింపు పొందిన పవన్‌కల్యాణ్, ఇప్పుడు దర్శకత్వం చేపట్టాలనుకుంటున్నారు. ఆ చిత్రంలో చిరంజీవి హీరో అయితే పవన్‌కల్యాణ్ ఓ



హాస్యపాత్ర పోషిస్తున్నారు. చూడబోతే మరీ చిన్నవయసున్న దర్శకులు ఎక్కువైనట్టున్నారు కదూ?

ఎస్.

తయారయి రావటం పూర్తిగా లేదు. రాగానే 'పదండి పదండి' అని తొందర చేసింది తాయారు. అతని నెమ్మదితనానికి ఆమె తొందరపాటుకీ సరిపోయింది.

నరసింహంగారు పంపించిన కారులో ఇద్దరూ కూర్చున్నాక కారు మెత్తగా కదిలింది. పడవలాంటి పెద్దకారు. కడిగిన ముత్యంలాగా వుంది. ఏసీ. చల్లగా హాయిగా వుంది. తాయారు కళ్లు మెరిశాయి. భూషణం కళ్లల్లోకి అదోకలాగా చూసింది. మెత్తగా నవ్వుతాడు అతను. అతను ఎప్పుడూ అంతే. చివ్వున పొంగిరాబోయింది కోపం. పడగ విప్పబోయింది, అహం. ఆ వెంటనే ఆ రెండూ తోక ముడుచుకుని మాయమవగా, లజ్జపడి కళ్లు వాల్చుకుంది ఆమె.

వాళ్లు వెళ్లేసరికి నరసింహంగారు ఇంట్లోనే వున్నారు. భవాని తాయారుని సాదరంగా ఆహ్వానించింది. వారి అమ్మాయి వనజ చిరునవ్వుతో మర్యాదలు చేసింది. ఆడువారు వంట గదిలో కబుర్లలో పడ్డారు. మగవాళ్లు హాల్లో కూర్చొని లోకాభిరామాయణం సాగించారు.

నరసింహం మంచి మాటకారి. ఆయనకి, మాటలు వినే మనిషి దొరికితే, ఇక మాటలు ఆపడు. స్వతహాగా, భూషణం ఎదుటి వాళ్లు చెప్పేది ఎక్కువగా వినటంతో సరిపెట్టుకుంటాడు.

'చూడండి! రోజు రోజుకీ ప్రపంచం మారిపోతూవుంది. ఎవడ్నీ నమ్మటానికి లేదు. ప్రతీవాడూ ప్రక్కవాడికి టోపీ పెట్టటానికి ప్రయత్నించటమే! పొలాలు కవులుకి తీసుకున్న వాళ్లు, కవుల్ను ఎలా ఎగ్గొట్టాలా అని చూస్తారు. మేడని అద్దెకి పుచ్చుకున్న వాళ్లు అద్దె ఇవ్వకపోవటం అటుంచి, మేడ ఖాళీ చెయ్యరు. కోర్టులకి ఎక్కుతామని బెదిరిస్తారు. ఏడిపిస్తారు. వ్యాపారాల్లో భాగస్తులు, పెదాలపైన చిరునవ్వులు రువ్వుతూనే, వెనకాతల గోతులు తీయనారంభిస్తారు. మనుషుల్లో నీతి లేదు. నిజాయితీ కొనప్రాణంతో, గాలిలో దీపం వలే వూగులాడుతున్నది. పెళ పెళ లాడే నోట్ల కట్టలు గుమ్మరించి స్థలం రిజిస్టరు చేయించుకుంటే, అది చెల్లదు! అసలు ఆ స్థలం నాదీ, అంటూ నెల దిరగకుండానే తయారవుతాడు మరొకడు. వాడికి రాజకీయాల అండ వుందన్న కావరం! ఘర్షణలు. కేసులు. కోర్టుల్లో పడి అవి తెమిలి చావవు. తరాలు గడిచిపోవాలి. ఈ లోగా పీల్చి పిప్పి చేసే ఖర్చులు. ప్లీడర్లు, ప్లీడరు గుమాస్తాలు పీక్కు తినాలని కాచుకుని కూర్చుంటారు. దున్నే వాడిదే భూమి. వుండేవాడిదే ఇల్లు. బలం గల వానిదే రాజ్యం. బ్యాంకులు ఎప్పుడు దివాలా తీస్తాయో తెలియదు. అదీ చాలదన్నట్లుగా, మనిషికి నిద్రలు లేకుండా చేసి భయం గొలిపే టాక్సుల వాళ్లు! ఒక మనిషి ఈ పరిస్థితుల్లో ఎట్లాగండీ ప్రశాంతంగా బ్రతకటమూ? భూషణంగారూ' ఆగాడు నరసింహం ఆయాసము వచ్చి. భూషణం తలవూపి నవ్వాడు సన్నగా. ఆవేశంగా బుస గొట్టాడు నరసింహం.


లోపల్నుండి కాఫీ ఫలహారాలు వచ్చేయి, అయ్యేయి.

ఆ తర్వాత తన గొడవలన్నీ వివరంగా చెప్పుకొచ్చాడు నరసింహం. విన్నాడు భూషణం. స్వంత వూర్లో కవులుదార్లతో ఘర్షణ అయ్యింది. వాళ్ళు కవుల్లు సరిగ్గా ఇవ్వరు.భూములు ఖాళీ చెయ్యరు. వాటిపైన కోర్టుల్లో నాలుగు కేసులు వున్నాయ్. విజయవాడలో మేడల్లో అద్దెకి వుంటున్న వాళ్లతో జరిగిన గొడవలపైన రెండు కేసులు కోర్టుల్లో వున్నాయి.

ఈ హైదరాబాద్‌లో కొత్తగా రాబోతున్న ఎయిర్‌పోర్టు దగ్గర సంవత్సరం క్రిందట పొలం కొనగా అదీ లిటిగేషన్లో పడింది! ఇరవై లక్షల డబ్బు 'బ్లాకు'అవటమేగాక స్థానిక రవుడీల్తో ఘర్షణలూ, కోర్టుల్లో కేసులూ నడుస్తున్నాయ్.

ఈ జీవితంలో సుఖం లేదు భూషణంగారూ! తిండి సహించదు. తిన్నది అరగదు. సరిగ్గా నిద్ర పట్టదు. సమస్యలకి పరిష్కారం అగుపడదు. ఎండమావులూ, వాటి వెంబడి పరుగులూ ఏదో భయంగా అనిపిస్తుంది. దిగులు మింగేయాలని కళ్లు రుమి చూస్తోంది. బాగా అలిసిపోయాను. నాకు సాంత్వన లేదు...' ఆగాడు నరసింహం. అతని గొంతు జీర బోయింది. ఏదో దిగులు కనపడింది.

భూషణం ఏదో చెప్పబోయి మరుక్షణం ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.




భోజనాలకి లెమ్మని కబురు వచ్చింది. లేచారు.

భోజనాల దగ్గరా మాటలు ఆపలేదు నరసింహం.

'ఇన్నాళ్లూ సింహంలాగా బ్రతికాను. పులిలాగా చలాయించుకొచ్చాను. అప్పటి ఓపిక ఇప్పుడు లేదు. ఈ వయస్సు తన ప్రభావం చూపిస్తోంది. ఆ మధ్యన ఒకరోజు కోర్టులో కళ్లు తిరిగి పడిపోయాను. వెంటనే డాక్టర్లని

సంప్రదించాను. టెస్టులు తీశారు. బీ.పీ. వుంది. షుగర్ బాగా వుందట. అప్పటినుండీ చప్పిడి తిండే! పంచదార నిషిద్ధం. వుప్పుకూడదు. పులుపువడదు. నిష్కర్షగానే వుంటున్నాను మొండివాణ్ణే గదా. అయినా రెణ్ణెల్ల క్రిందట గుండెల్లో నొప్పివచ్చింది చెయ్యి లాగింది. చమటలు పట్టాయి. వాంతీ అయ్యింది. హాస్పటల్‌కి పరిగెత్తాము. లక్షలు కోసం వెనకాడలేదు. స్పెషలిస్టులని సంప్రదించటానికి రెండో ఆలోచనా చెయ్యలేదు. ఇ.సి.జీ.లు తీసారు.' ఏంజియోగ్రామూ' తీసారు. చూసి వాళ్లు ఏమన్నారో తెలుసునాండి?!

ఈ గుండెల్లో అటు రెండూ ఇటూ రెండూ వున్నాయట 'బ్లాకు'లు! బైపాస్ సర్జరీ చేస్తారట. ఈ నెలాఖరుకి పెట్టారు ఆ ముహూర్తం. ఈలోగా షుగరూ, బి.పి. తగ్గించటానికి మందులు మింగ మన్నారు. రోజూ గుప్పెడు మందులు మింగుతున్నాను..'

వాళ్ల భోజనాలు అయ్యాయి. ఆడ వాళ్ల భోజనాలూ అయ్యేటప్పటికి రెండయ్యింది.

వాళ్లు సాగనంపటానికి కారు దగ్గరికి వచ్చారు. అప్పుడు భూషణం చేతిని తన చేతిలోకి తీసుకుని స్నేహ పిచ్చిలంగా నొక్కాడు నరసింహం. కొత్తగా అనిపించింది భూషణానికి.

'మిమ్మల్ని చూస్తే అసూయవేస్తుంది. అంత నిమ్మళంగా ఎప్పుడూ ఎలా వుండగలుగుతారూ?' అన్నాడు నరసింహం. భూషణం చిరునవ్వు నవ్వాడు.


'నా కథంతా విన్నారు గదా మీరు. ఒక స్నేహితుడిగా నాకు పరిష్కారం సూచించగూడదా?' అన్నాడు నరసింహం.

'మీకు నేను చెప్పటమా?!' ఆశ్చర్యంగా అన్నాడు భూషణం.

'ఏం ఫర్లేదు చెప్పండి. వరదల్లో కొట్టుకుని పోయేవాడికి గడ్డిపోచ అయినా కొండంత ఆధారంగా అనిపిస్తుంది.

'నరసింహంగారూ! మీరు వర్రీ అవకండీ' అన్నాడు భూషణం, నింపాదిగా.

'ఎట్లా?! వర్రీ అవకుండా వర్రీ అవకుండా వుండటం ఎట్లా? అంతా వినికూడా అది సాధ్యమని మీకు ఎట్లా అనిపిస్తుందీ?!' నరసింహం గొంతులో తీవ్రత ధ్వనించింది.




'ఈ మనది అని మనం అనుకునేది ఏదీ మనది కాదు. అందువల్ల ఏది ఎట్లా ఎందుకు జరగాలో అది అట్లా జరగనీ అనుకుంటే మనస్సుకి శాంతి చిక్కుతుంది. శాంతము లేక సౌఖ్యమూ 'లేదు అని గదా అన్నాడు మహానుభావుడు! నేను ఎక్కువగా మాట్లాడినట్లున్నాను క్షమించండి. వస్తాను...' సిగ్గుపడ్డాడు భూషణం.

'అది ఏంగాదుగాని, చాలా థాంక్సండి! అన్నాడు నరసింహం. అతని కళ్లలో తాత్కాలికంగా ఒక మెరుపు!

కారు కదిలింది. వెనకాల నిలబడి చెయ్యి ఎత్తి వూపుతున్న నరసింహం కన్నుల్లో ఒక పల్చని తడితెర అలుముకొనటం గమనించాడు భూషణం. దారి పొడుగునా తాయారు ఏదో చెపుతూనే వుంది. వినటం భూషణం వంతయ్యింది.

ఆ రోజుకి నాలుగో నాడు ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. భూషణానికి నిద్ర మగతగా వుంది. పూర్తి మెలకువ రాలేదు. పాదాలని ఏదో తాకినట్లు అనిపించి హఠాత్తుగా కళ్లు తెరిచాడు భూషణం.

చేతుల్తో భర్త పాదాలను స్పృశించి, మంగళసూత్రాలకి వాట్ని తాకించి, కళ్లకి అద్దుకుంటూ వుంది తాయారు. ఆమె కళ్లు శ్రావణ మేఘాల్లాగున వున్నాయ్.

'తాయారూ!! ఏమిటిదీ?' అంటూ కంగారుగా లేచి కూర్చున్నాడు. రెండు చేతుల్తోనూ ఆమెని పొదివి పట్టుకుని దగ్గరకి తీసుకున్నాడు, లాలనగా. ఆమె చాలా దిగులుగా వుంది.

"ఏమే! ఎన్నడూ లేనిది ఏమిటెట్టాంటి పన్లూ?' మేలమాడాడు. తాయారు సిగ్గుపడింది. మరింతగా తల వంచుకుంది.

'ఏమో! నాకు అట్లా అనిపించింది. చేశాను. తప్పేంటి?' అంది గద్గద స్వరంతో ఆమె. అతను సిగ్గుపడ్డాడు. అతని చేతుల్ను విడిపించుకుని దూరంగా జరిగి తాయారు ఉలిక్కిపడింది.

'ఇక లేచి మీరు మొహం కడుక్కొని తయారవ్వండి, త్వరగా. మనం వెంటనే నరసింహం గారింటికి వెళ్లాలి' అని తొందర చేసింది. వాళ్లు నరసింహంగారింటికి వెళ్లాక తెలిసింది. ఏదో వ్యవహారంలో ఎవర్తో నో బాగా ఘర్షణ పడిన నరసింహం, ఆ తెల్లవారఝామున ఒక పెద్ద హోటల్‌రూంలో 'మాసివ్ హార్ట్ ఎటాక్' వచ్చి క్షణాల్లో పోయాడట. తెల్సినవాళ్లందరికీ ఫోన్లు చేసి, అప్పుడే ఇంటికి తీసుకువచ్చారట. ఎంత విషాదం? ఎంత పని జరిగింది!? ■

## సాధించిన రచన

కలకత్తాలోని తాలీగంజ్ నుంచి టాలీవుడ్‌కు వచ్చిన నటి రచన. ఇ.వి.వి.సత్యనారాయణ చిత్రం జె.డి.చక్రవర్తితో రచన 'నేను ప్రేమిస్తున్నాను'లో హీరోయిన్‌గాచేసింది. ఇది ఆమె తొలిచిత్రమే కాక, హిట్టయ్యింది కూడా. తరువాత వచ్చిన 'కన్యాదానం' చిత్రంలో మరికాస్త గుర్తింపు సంపాదించుకుంది రచన. కొన్ని విమర్శలను ఎదుర్కొంది కూడా. 'బావగారూ బాగున్నారా?' చిత్రంలో సెకెండ్ హీరోయిన్‌గానూ చేసింది. ఆ చిత్రమూ సుమారుగా నడిచింది. అటుతరువాత అదృష్టం వరించిన రచన, ఉన్నట్టుండి బహుభాషానటి అయిపోయింది. తెలుగులో చిరంజీవితో 'నీతోటే ఉంటాను'లోనే కాక 'అంతా మన మంచికే'లోనూ చేస్తున్న రచన, ఇంకా హిందీ, తమిళ, ఒరియా, బెంగాలీచిత్రాల్లోనూ నటిస్తున్నది. ఒక్కసారిగా నాలుగైదుభాషల్లో నటిస్తున్న ఘనత కూడా రచనే సాధించింది!



ఎన్.